# కాలాన్ని కరిగిపోనీకండి



కాలం అనుక్షణం కరిగిపోతూ ఉంటుంది. అది ఎవరికోసమూ ఆగదు. గర్ల్‌ఫ్రెండ్‌తో గడిపేవేళ గంటలు క్షణాల్లా కరిగిపోతాయి. మండుటెండలో మాడే సమయాన క్షణాలు కూడా యుగాల్లా తోస్తాయి. కానీ ఆ రెండు సందర్భాల్లోనూ నడిచిన కాలం ఒకటే.

సమస్త రాజ్యాల్నీ, రాజ వైభోగాల్నీ, పండితుల ప్రజ్ఞాపాటవాల్నీ, కవుల కళా నైపుణ్యాలనీ, ఎన్నెన్నో అనుభూతుల్నీ, గత వైభవాల్నీ నిర్ధాక్షిణ్యంగా పొట్టన పెట్టుకొని వెనక్కి పరుగులు తీసే కాలాన్ని ఆపడం ఎవరి తరమూ కాదు.

చూస్తుండగానే జీవిత చరమాంకం దర్శనమిస్తుంది. ఏం సాధించామని కాలం కమ్ముకొచ్చేసింది ? ఏం అనుభవించామని తరలి వెళ్ళిపోయింది ? వెనక్కి తిరిగి చూస్తే ఏముంది ? వ్యర్థమైన జీవితం, వ్యధాభరితమైన గతం తప్ప ? అందుకే ప్రతీ క్షణాన్నీ గుప్పెట అదిమి పెట్టి ప్రతిఫలాన్ని ఇవ్వనిదే జారిపోనీకుండా నిరోధించాలి.

## కానీ ఎలా ?

అదే వేయి వరహాల తుల్యమైన విలువైన ప్రశ్న. దానికి సమాధానాలు ఎన్నెన్నో. అందులో కొన్ని.

1. ఉదయం లేవగానే ఒక ప్రశ్న మిమ్మల్ని మీరు నేను వేసుకుంటే ? అదేవి ఎటంటే కలకాలం గుర్తుండిపోయే ఓ మంచి పని ఈ రోజు ఏదైనా చేస్తే ఎలా ఉంటుంది ?

2. మధ్యలో ఓ సారి మీకు బాలా ఆత్మీయంగా ఉన్న వాళ్ళతో కాస్సేపు (ఏ అవసరం లేకపోయినా) ఫోన్‌లో మాట్లాడితే ఎంత బాగుంటుంది ?

3. ఆదివారమో మరో సెలవు రోజో వృద్ధాశ్రమానికి వెళ్ళి అక్కడి వృద్ధులని కలిసి ప్రేమగా మాట్లాడితే వాళ్ళ కళ్ళల్లో వెలిగే కాంతి ఎంత శోభాయ ఎమానంగా ఉంటుంది ?

4. ప్రతి రెండు గంటలకొక సారి ఎంత బిజీగా ఉన్నా కాస్సేపు హాయిగా ఊపిరి పీల్చుకుని ఒకే ఒక్క మాట "నిన్న జరిగిపోయింది జీవితం కాదు. రేపు అనేది ఉందో లేదో తెలీదు. ఈ రోజే జీవితం. ఈ క్షణమే జీవితం. ఈ క్షణాన్ని నేను ఎంజాయి చేస్తున్నాను అనుకుంటూ తిరిగి పనిలోకి ప్రవేశిస్తే ఎలా ఉంటుంది ?

5. ఏ మాత్రం ఆస్తిపాస్తులు లేని మీరు అవి బాగా ఉన్న వాళ్ళని చూసి జాలిపడితే ఎలా ఉంటుంది ? (అవును. జాలి పడాలి. ఎందుకంటే ఉన్న ఊరి స్వేచ్ఛావాయువుల్నీ, కన్న తల్లి ప్రేమానురాగాల్నీ, బంధుమిత్రుల ఆత్మీయతల్నీ అన్నిటినీ వదిలి డబ్బే ప్రధానమని భావించి, సమయానికి తిండిలేక, సరిపడినంత నిద్రలేక, అహోరాత్రాలు కష్టపడి లక్షలు, కోట్లు ఆర్జించి తిరిగి వచ్చిన వాళ్ళని చూసి ఈర్ష్య పడవద్దు. డబ్బు సంపాదించడంలో సంతోషం లేదు. దాన్ని అనుభవించడంలోనే ఉందన్న సంగతి వాళ్ళకి తెలీదు. అలా సంపాదించి డబ్బుతో తిరిగి వచ్చిన వాళ్ళు ఖచ్చితంగా అమూల్యమైన, ఎంతో ఆనందకరమైన జీవితాన్ని కోల్పోయి ఉంటారు. వాళ్ళు డబ్బుని మాత్రమే కలిగి ఉంటారు. అనుభవించేది మాత్రం వాళ్ళ పిల్లలో, మనవలో అయిఉంటారు. అందువల్ల వాళ్ళని చూసి కాస్తో కూస్తో జాలి పడడంలో తప్పు లేదు).

జ్ఞాపకమే జీవితం. మనసుని పులకింప చేసే ప్రతీ క్షణమూ ఒక జ్ఞాపకాన్ని మన మనసులో వదిలి వెడుతుంది. అలాంటి క్షణాలు ఎన్ని ఉన్నాయన్న దాన్ని బట్టే మనం ఎంత సార్ధకంగా జీవించామన్నది ఆధారపడి ఉంటుంది. అందుకే పైన చెప్పిన పాయింట్లన్నీ.

బ్రతుకుని నిస్సారంగా ఈడ్చడం కన్నా
ఆనందంగా జీవించండంలోనే కదా
మన తెలివి తేటలు బయట పడేది ?

**అవునంటారా/కాదంటారా ?**